సాక్షి
రాజన్న సిరిసిల్ల
సోమవారం : 22 : మే : 2023



ఆర్టీసీ డిపో సందర్శన

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపోను, బస్టాండ్‌ను కరీంనగర్ ఆర్‌ఎం సుచరిత ఆదివారం సందర్శించారు.



చాలీచాలని వేతనాలతో ఇంకెన్నాళ్లు?

చందుర్తి(వేములవాడ): సఫాయిలు, కారోబార్లు, ఎలక్ట్రీషియన్లు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి(చొప్పదండి): అనుకోని ప్రమాదాలతో మృతిచెందే బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని తడగొండకు చెందిన కార్యకర్త కట్ట రాజమల్లయ్య గతంలో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. ఈమేరకు రాజమల్లయ్య కుటుంబసభ్యులకు ఆదివారం పార్టీ ద్వారా రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచ్ చిందం రమేశ్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, కట్ట నర్సింగం, కమల్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మజీద్‌కు జిల్లా పంచాయతీ అధికారి షోకాజ్ నోటీసు జారీచేశారు. పర్యవేక్షణ లోపంతో పంచాయతీ సిబ్బంది వసూలు చేసిన పన్నుల డబ్బులను సొంతానికి వినియోగించుకున్నారని దీనిపై సంజాయిషీ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ శిరీష పన్నుల రూపంలో వసూలు చేసిన రూ.5.53 లక్షలు వాడుకున్నట్లు తెలుస్తోందని నోటీస్‌లో పేర్కొన్నారు. శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని నోటీసులు ఇచ్చారు.

పదోన్నతులు చేపట్టాలి

ఇల్లంతకుంట(మానకొండూర్): వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మాన్వాడ శంకర్ కోరారు. ఇల్లంతకుంటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. డీఏలతోపాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, వెంకటేశ్, కిశోర్‌గౌడ్, సరోజ, సత్యనారాయణ, రాము, వంశీధర్‌రెడ్డి, నాగరాజు, బాబు, రాజ్‌కుమార్, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



పతకాలను చూపుతున్న విద్యార్థులు

రుద్రంగి(వేములవాడ): ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో రుద్రంగి మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో డి.జాహ్నవి, అశ్విత్ రజత పతకాలు, మహశ్విత, అవంతిక, చరిత కాంస్య పతకాలు సాధించారు. వీరిని రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, సర్పంచ్ తర్రె ప్రభలత, కోచ్ సుజీవన్ అభినందించారు.

నర్సుగా మారిన స్వీపర్



చికిత్స చేస్తున్న స్వీపర్ ఎల్లవ్వ

కోనరావుపేట(వేములవాడ): ఆదివారం వచ్చిందంటే చాలు ఆస్పత్రిలో సిబ్బంది ఎవరు ఉండడం లేదు. కోనరావుపేటలో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన ఇద్దరికి, కోనరావుపేటకు చెందిన ఒకరికి గాయాలయ్యాయి. వీరిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో స్వీపర్ ఎల్లవ్వ క్షతగాత్రులకు ప్రథమచికిత్స చేసి పట్టి కట్టింది. గంట తర్వాత వచ్చిన ఏఎన్‌ఎం ఇంజక్షన్ వేసి, మందులిచ్చి పంపింది. స్వీపర్ చికిత్స అందించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే ఆస్పత్రిలో ఎవరూ ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారి వేణుమాధవ్‌ను వివరణ కోరగా విధుల్లో ఉన్న ఏఎన్‌ఎం వ్యక్తిగత పనిమీద వెళ్లి వచ్చి, తర్వాత చికిత్స అందించిందని తెలిపారు.

తాగునీటి తండ్లాట

- వేములవాడలో వేళాపాళా లేని నీటి సరఫరా
- మిషన్‌భగీరథ అస్తవ్యస్తం
- ప్రణాళికలు లేక పట్టణవాసుల పరేషాన్
- పట్టించుకోని అధికారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న నీటిట్యాంక్ నాంపల్లి వద్ద నిర్మించింది. ఇక్కడి నుంచే వేములవాడ మున్సిపాలిటీకి నీరు సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ నిర్మించినప్పటి నుంచి సరిగ్గా నీటి సరఫరా జరిగిన ఆనవాళ్లు లేవు. ఇంత పెద్ద రిజర్వాయర్ ఉన్నా వేములవాడ పట్టణవాసుల దాహార్తి తీరడం లేదు.



❒ ఇది వేములవాడలోని గృహాలకు నీరు సరఫరా చేసేందుకు మార్కెట్‌యార్డులో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు. కానీ ఇది ఎప్పుడు కూడా పూర్తి స్థాయిలో నిండలేదు. ఫలితంగా కాలనీలకు నీరు సరిగ్గా సరఫరా కావడం లేదు.



❒ ఈ చిత్రంలో ఖాళీ బిందెతో ఉన్న మహిళ సగ్గు పద్మ. వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ నివాసి. ఏ టైంకు నీరు సరఫరా అవుతుందో తెలియక ఇబ్బంది పడుతోంది. సరిగ్గా సరఫరా కానీ నీటికి నెలకు రూ.100 వసూలు చేయడం ఏంటని ఆమె ప్రశ్నిస్తోంది.

వేములవాడ: వేములవాడ మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ నీరు సరిగ్గా సరఫరా కావడం లేదు. ఏ సమయానికి నీళ్లు వస్తాయో తెలియక పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణానికి నీటి సరఫరా చేసేందుకు ఒక రిజర్వాయర్, రెండు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు నిర్మించినా సరిగ్గా నీరు సరఫరా కావడం లేదు. వేళా..పాళా లేని నీటి సరఫరాతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్‌భగీరథ పనులు సక్రమంగా లేకపోవడంతోనే నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.

రూ.42కోట్లతో పనులు

వేములవాడ పట్టణానికి నీటి సరఫరా చేసేందుకు రూ.42కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపట్టారు. పనులు అసంపూర్తిగా చేయడం, చేసిన పనులు కూడా సక్రమంగా లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నల్లా కనెక్షన్లు ఇచ్చినా సక్రమంగా నీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నీరు సక్రమంగా సరఫరా కాకపోగా.. మున్సిపల్ సిబ్బంది ప్రతీ నెల ఇంటింటికీ వచ్చి రూ.100 వసూలు చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేములవాడ ప్రొఫైల్

మున్సిపల్ జనాభా	: 44,481
గృహాలు	: 13,351
నల్లా కనెక్షన్లు	: 9,981
ఓవర్‌హెడ్ ట్యాంకులు	: 06
సంపులు	: 02
నీటి విభాగం సిబ్బంది	: 30

తిప్పాపూర్‌కు నీళ్లు రావడం లేదు



కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ నల్లా నీళ్లు ఇస్తున్నామని చెబు తున్నా అమలు కావడం లేదు. తిప్పాపూర్‌కు మిషన్ భగీరథ నీరు రావడం లేదు. నల్లానీరు సరఫరా చేసేందుకు ఇంకా పైప్‌లైన్ కూడా వేయలేదు.

– ఆలూరి మమతారెడ్డి, తిప్పాపూర్, వేములవాడ

రిజర్వాయర్ పూర్తయ్యింది



వేములవాడకు భగీరథ నీటి సరఫరా చేసేందుకు నాంపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తున్నాం. అది ఇటీవలే పూర్తయ్యింది. త్వరలోనే నీటి విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశమై నల్లానీరు సకాలంలో సరఫరా అయ్యేలా చొరవ తీసుకుంటాం. నల్లా బిల్లులు అన్ని మున్సిపాలిటీలలో వసూలు చేస్తున్నారు.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్

న్యాయం చేయాలని గవర్నర్‌కు ఫిర్యాదు

- సిరిసిల్ల రూరల్ సీఐపై ఫిర్యాదు చేసిన లక్ష్మీపూర్ వాసి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తనపై అన్యాయంగా హత్యానేరం మోపారని న్యాయం చేయాలంటూ గవర్నర్ తమిళిసైని కలిసి వేడుకున్నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన ఎలుగుమెట్ల నాగిరెడ్డి. శుక్రవారం గవర్నర్‌ను కలిసి సిరిసిల్ల రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆదివారం ప్రెస్‌నోట్ విడుదల చేసిన అనంతరం నాగిరెడ్డి మాట్లాడారు. తన చిన్నతనంలోనే తండ్రి జనార్దన్‌రెడ్డి చనిపోయాడని, తల్లి లక్ష్మి 2018లో అనారోగ్యంతో చనిపోవడంతో తమ్ముడు పర్శరాంరెడ్డి తాను మాత్రమే మిగిలామన్నారు. తాను ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపాడు. అన్నదమ్ముల మధ్య గ్రామానికి చెందిన నాయకులు మనస్పర్థలు కల్పించి.. తమ్ముడిని తాగుడు, డ్రగ్స్‌కు బానిస చేశారని వాపోయాడు. తన తమ్ముడి పేరిట ఉన్న భూమిని సదరు నాయకులు రిజిస్ట్రేషన్ చేసుకుని చంపివేసి, తనపై హత్యానేరం మోపారని ఆరోపించాడు. సిరిసిల్ల రూరల్ సీఐ వాస్తవాలు తెలుసుకోకుండా తనను 7 రోజులపాటు బంధించాడని.. కనీసం తమ్ముడి అంత్యక్రియలు కూడా చేయనీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తమ్ముడి చావుకు కారణమైన 9 మందితోపాటు వారికి సహకరించిన రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు పేర్కొన్నాడు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని సంబంధిత అధికారులకు రాజ్‌భవన్ నుంచి నోటీసులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపాడు.

24న హుండీ లెక్కింపు

వేములవాడ: రాజన్న హుండీ లెక్కింపు ఈనెల 24న చేపడుతున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఓపెన్‌స్లాబ్‌లో చేపట్టే హుండీ లెక్కింపులో అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు

సిరిసిల్లఅర్బన్: మినీ స్టేడియంలో సోమవారం నుంచి బుధవారం వరకు జిల్లా స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడా శాఖాధికారి ఉపేందర్‌రావు ప్రకటనలో తెలిపారు. సోమవారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, 23న రెజ్లింగ్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, స్విమ్మింగ్, 24న వాలీబాల్ ఫైనల్ , అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయి.

కుటుంబం కుల బహిష్కరణ

- ఎస్సీ యువతిని పెళ్లి చేసుకోవడమే కారణం
- రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలో అమానుషం



మాట్లాడుతున్న బాధితుడు గాదెనవేణి మధు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఎస్సీ యువతిని పెళ్లి చేసుకున్నాడనే కారణంతో ఓ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. తంగళ్లపల్లికి చెందిన గాదెనవేణి మధును కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు ముదిరాజ్ కులపెద్దలు నిర్ణయించారని వాపోయాడు. వివరాలు బాధితుడు మధు కథనం ప్రకారం. ముదిరాజ్ కులానికి చెందిన మధు, ఎస్సీ కులానికి చెందిన జిన్సిని ఐదేళ్ల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. వీరికి కూతురు నవోమి ఉంది. ఇటీవల మధు భార్య జిన్సి పేరిట ఇంటి నిర్మాణం చేపట్టగా ముదిరాజ్ కులానికి చెందిన ఓ నాయకుడు అడ్డుపడుతున్నాడు. ఈ విషయమై పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోలేదని మధు వాపోయాడు. చివరికి కులపెద్దలను కలువగా.. ఎస్సీ అమ్మాయిని పెళ్లి చేసుకున్నందున కుల బహిష్కరణ చేసినట్లు చెప్పారన్నారు. సంఘం సభ్యత్వ రుసుం తీసుకుని వెళ్లిపోవాలని ఆదేశించినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. తనను అకారణంగా కుల బహిష్కరణ చేసిన కులపెద్దలపై చర్యలు తీసుకోవాలని మధు కోరుతున్నాడు.

రాజీవ్‌గాంధీకి నివాళి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, వకులాభరణం శ్రీనివాస్, కనికరపు రాకేశ్, చిలుక రమేశ్, ముడికె చంద్రశేఖర్, కొము రయ్య తదితరులు ఉన్నారు.



వీవోఏల సమస్యలు పరిష్కరించండి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



చందుర్తిలో వీవోఏల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఐకేపీ వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారించాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చందుర్తిలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆదివారం ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగంకుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శి గొట్టే ప్రభాకర్ సంఘీభావం తెలిపారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వీవోఏలు సమ్మెను సీఎం కేసీఆర్ పట్టించుకోకపోవడం ఒంటెత్తు పోకడకు నిదర్శనమన్నారు. చాలీచాలని వేతనం ఇస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనంతోపాటు రూ.10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీలు మ్యాకల గణేశ్, పులి రేణుక, నాయకులు దారం చంద్రం దేవుడి మల్లేశం , బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, సంతుపూరి బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసు

- ఎస్పీ అఖిల్ మహాజన్



తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారి

సిరిసిల్లటౌన్: నకిలీ విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. పోలీస్, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లోని దుకాణాలపై దాడులు చేశారు. అధికారులు ఐదు బృందాలుగా విడిపోయి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని వ్యాపారులు నకిలీ విత్తనాలు అమ్మితే..తక్షణమే స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ 87126 56411, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. 2021లో నకిలీ విత్తనాలు అమ్మిన ఇద్దరు వ్యక్తులపై పీడీయాక్టు నమోదైందని వివరించారు.

చందుర్తి(వేములవాడ): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మర్రిగడ్డలో ఫర్టిలైజర్, పెస్టిసైడ్, విత్తనాల దుకాణాలపై సీఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. పెస్టిసైడ్‌ను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులకు విక్రయించే విత్తనాల బిల్లుల రశీదులను తప్పకుండా ఇవ్వాలన్నారు.




మొక్కులు చెల్లించినం రాజన్న




వేములవాడ: వేసవి సెలవులు దగ్గర పడుతుండడంతో రాజన్న దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం 25 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాజన్నను ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులకు వేదోక్త ఆశీర్వచనం గావించారు.

నిండుకుండ.. నీరందక వెత

- నాగారం రిజర్వాయర్ ఆయకట్టు దుస్థితి
- ఊసేలేని కుడి, ఎడమ కాలువల నిర్మాణం
- ఏటా వేసవిలో ఎండుతున్న పంటలు
- అధికారులు పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన



నిండుగా నాగారం రిజర్వాయర్



బీడుగా ఉన్న ఆయకట్టు కింది భూములు

రుద్రంగి(వేములవాడ): రిజర్వాయర్ నిండుగా నీరున్నా.. ఆయకట్టు భూములకు చుక్క కూడా రాని పరిస్థితి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే ఏమి చేయలేని దైన్యస్థితిలో రైతులు ఉన్నారు. మెట్టప్రాంతం రుద్రంగి పరిధిలోని భూములను సస్యశ్యామలం చేసేందుకు నాగారం చెరువును ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకం కింద రిజర్వాయర్‌గా మార్చారు. రిజర్వాయర్‌లోకి నీరు వచ్చే కాలువలు పూర్తికాగా.. ఆయకట్టు భూములకు నీరందించే కుడి, ఎడమ కాలువల పనులు చేయలేదు. ఫలితంగా ఆయా భూముల్లోని పంటలు ఎండిపోతున్నాయి.

800 ఎకరాలకు నీరు

నాగారం చెరువు ఆయకట్టు కింద 800 ఎకరాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కోట్ల రూపాయలు వెచ్చించి రిజర్వాయర్‌గా మర్చారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరందలేదు. నాగారం చెరువుగా ఉన్నప్పుడే సుమారు వందెకరాలకు తూము ద్వారా సాగు నీరందేది. రిజర్వాయర్‌గా మార్చిన తర్వాత అది కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చివరి దశలో ఎండుతున్న పంటలు

ఏటా యాసంగి పంటల సాగు దశలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. చివరి దశలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఎండలు ప్రారంభమై.. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఫలితంగా చివరి దశలో పంటలు ఎండిపోతున్నాయి.

మేతకు వదిలేస్తున్నాం



పంటలు చేతికందుతాయనుకున్న 15 రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. పంటలు ఎండిపోతుండడంతో పశువుల మేతకు వదిలేస్తున్నాం. పెట్టుబడులు మీద పడి తీవ్రంగా నష్టపోతున్నాం. కాలువలు నిర్మించాలి.

– శెట్టి కిషన్, రుద్రంగి

బీడుగా ఉంచుతున్నం



నాగారం రిజర్వాయర్ కట్ట కింది నాకు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. చెరువులో నిండుగా నీరు ఉన్నప్పటికీ కిందనే ఉన్న పొలాలకు నీరందడం లేదు. దీంతో బీడుగానే ఉంచుతున్నం. కాలువలు నిర్మిస్తే పంటలు పండుతాయి.

– దారిశెట్టి కిషన్, రుద్రంగి

పరిశీలనలో ఉంది



నాగారం రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించేందుకు కాలువల నిర్మాణ అంశం పరిశీలనలో ఉంది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వీలైనంత త్వరగా కాలువలు నిర్మిస్తాం.

– సంతు ప్రకాశ్‌రావు, ఈఈ, శ్రీపాద ఎల్లంపెల్లి ప్రాజెక్టు

క్లుప్తంగా

ఎల్లమ్మ సిద్దోగ వేడుకలకు ఆహ్వానం



గడతో తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో నిర్వహించే ఎల్లమ్మ సిద్దోగ వేడుకలకు హాజరుకావాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను ఆహ్వానించారు. కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరుట్లపేట గౌడ కులస్తులు ఆహ్వానించారు.

అనుమానిత వ్యక్తి సంచారం



పోలీసులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో శనివారం రాత్రి ఓ అనుమానిత వ్యక్తి సంచరించాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి గ్రామంలోని ఓ భవనం ఎక్కాడు. కొందరు చూసేసరికి మరో భవన పరిసరాల్లోకి వెళ్లాడు. అక్కడ కనిపించకపోవడంతో గ్రామస్తులు డయల్‌ 100కు ఫోన్‌ చేశారు. పెట్రోలింగ్‌ సిబ్బంది అక్కడికి వచ్చి వెతకగా ఆచూకీ లభించలేదు. పోలీసులు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

'గోవా టూర్‌ వ్యక్తిగతం'

వేములవాడ: గోవా టూర్‌ తమ వ్యక్తిగతమని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవి భర్త రాజు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో పార్టీలకు అతీతంగా స్నేహితులతో వెళ్లామని పేర్కొన్నారు. కొందరు తమపై రాజకీయ బురద చల్లేందుకు చూస్తున్నారని పేర్కొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేములవాడ రూరల్‌: మండలంలోని హన్మాజీపేట ఉన్నత పాఠశాలలో 1997– 98 లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

- 31న ఉదయం 7:26 గంటలకు భూమిపూజ.. శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణం
- ఏపీ సీఎం జగన్మోహన్‌ రెడ్డికి సీఎం కేసీఆర్‌ విజ్ఞప్తి
- సమ్మతించిన టీటీడీ బోర్డు
- కరీంనగర్‌లోని పద్మనగర్‌లో పదెకరాలు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్న టీటీడీ



ఇటీవల పద్మనగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి నిత్య పూజా ప్రియుడు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య దేవదేవునికి నిర్వహించే అనిర్వచనీయమైన నిత్య కైంకర్య వైభోగాన్ని కరీంనగర్‌లో జిల్లావాసులతోపాటు ఉత్తర తెలంగాణ భక్తులు త్వరలోనే ప్రత్యక్షంగా వీక్షించనున్నారు.

2018 నుంచి కరీంనగర్‌లో బ్రహ్మోత్సవాలు..

కరీంనగర్‌లోని మార్కెట్‌ రోడ్‌లో గల శ్రీవేంకటేశ్వరాలయానికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్‌ 2018లో శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఆరుసార్లు ఉత్సవాలు నిర్వహించారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి టీటీడీ సమ్మతి..

కరీంనగర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణ విషయమై మంత్రి కమలాకర్‌ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఏపీ సీఎం వైఎస్‌.జగన్మోహన్‌ రెడ్డితో మాట్లాడారు. కరీంనగర్‌లో తిరుమలేశుని ఆలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, టీటీడీ బోర్డుకు ఆదేశాలిచ్చారు. ఫలితంగా టీటీడీ బోర్డు కరీంనగర్‌లో ఆలయ నిర్మాణానికి సమ్మతించింది.

పశుసంవర్ధక శాఖ స్థలం కేటాయింపు

వెంకన్న ఆలయ నిర్మాణానికి మార్చి 15, 2022న కరీంనగర్‌లోని పద్మనగర్‌లో గల పశుసంవర్ధక శాఖకు సంబంధించిన పదెకరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సంబంధిత పత్రాలను సీఎం కేసీఆర్‌ అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో మంత్రి గంగుల కమలాకర్‌, టీటీడీ హైదరాబాద్‌ లోకల్‌ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌ జీవీ భాస్కర్‌రావులకు అందజేశారు. వీరు మార్చి 30న కలెక్టర్‌ కర్ణన్‌, మేయర్‌ సునీల్‌రావు, స్థపతి రవికాంత్‌లతో కలిసి, ఆ స్థలాన్ని పరిశీలించారు. ల్యాండ్‌ సర్వే సహాయ సంచాలకుడు అశోక్‌, సర్వేయర్లు కొలతలు తీశారు.

వెంకటాచల ఆలయ సందర్శన

అమరావతిలో నిర్మాణంలో ఉన్న వెంకటాచల టీటీడీ ఆలయాన్ని మే 28, 2022న మంత్రి కమలాకర్‌ తన బృందంతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. మరుసటి రోజు టీటీడీ ప్రధాన స్థపతి మునిస్వామిరెడ్డి, సహాయ స్థపతి కృష్ణారావు, యాదాద్రికి పని చేసిన ఆనంద్‌సాయి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌లతో కలిసి కరీంనగర్‌లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

అనుమతి పత్రాలిచ్చిన టీటీడీ చైర్మన్‌

ఈ నెల 15న టీటీడీ చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డి కరీంనగర్‌లో ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను మంత్రికి హైదరాబాద్‌లో అందజేశారు. రూ.20 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ నెల 31న ఉదయం 7:26 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య భూమిపూజ, అదేరోజు సాయంత్రం శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నారు.

ఆగమశాస్త్రం ప్రకారం నిర్మిస్తాం



త్వరలో తిరుమల వెళ్తాం. వేంకటేశ్వర స్వామి అంతరాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతోపాటు మూలవిరాట్టు, పోటు, ప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలిస్తాం. ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మించి, రాష్ట్ర ప్రజలకు ఆ దేవదేవుని దర్శన భాగ్యం కల్పిస్తాం. – గంగుల కమలాకర్‌, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి

దగ్గరలో స్వామివారి దర్శనం



దూరభారంతోపాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ తిరుమల వెళ్లలేని వారికి దగ్గరలో వేంకటేశ్వర స్వామివారి దర్శన అవకాశం లభించనుంది. కరీంనగర్‌లో ఆలయ నిర్మాణం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ప్రయాణ బాధలు తప్పుతాయి. వారికి స్వామివారి దర్శన భాగ్యం కలుగుతుంది. – గోగుల ప్రసాద్‌, కరీంనగర్‌ శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యుడు

మూడు తరాలు.. ఒకే చోట



హైదరాబాద్‌లో కముటాల కుటుంబ సభ్యులు

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన కముటాల 'బలగం' ఆదివారం కలిసింది. కోనరావుపేట మండలం మర్రిమడ్లకు చెందిన కముటాల విఠల్‌, నాగలక్ష్మీ దంపతుల కుమారులు ప్రసాద్‌, విశ్వేశం, శ్రీనివాస్‌, వారి మరో ముగ్గురు సోదరీమణుల పిల్లలు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు రిసార్ట్‌లో ఆదివారం కలుసుకొని వేడుకలు చేసుకున్నారు. ఆరు కుటుంబాలకు చెందిన 96 మంది బంధువులు ఉండగా 82 మంది కలుసుకొని ఆత్మీయతను పంచుకున్నారు. మూడు తరాల పెద్దలు, పిల్లలు అందరూ ఎన్నో ఏళ్ల తర్వాత ఇలా కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు.

ఆర్థికసాయం అందించండి



మిట్టపెల్లి నవ్యశ్రీ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. తండ్రికి మతిస్థిమితం లేదు. దీంతో బాబాయ్‌ వద్ద పెరుగుతున్న ఆ యువతికి ఇటీవలే పెళ్లి నిశ్చయమైంది. కానీ ఆర్థిక ఇబ్బందులున్నాయని, తోచిన సాయం అందించాలని కోరుతోంది. వివరాలు.. మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌ గ్రామానికి చెందిన మిట్టపల్లి నవ్యశ్రీకి సిరిసిల్ల పట్టణానికి చెందిన యువకుడితో ఈనెల 24న వివాహం జరగనుంది. మిట్టపల్లి శేఖర్‌ 9000996122 ఫోన్‌ పే చేయగలరని కోరింది.

చాలీచాలని వేతనాలతో ఇంకెన్నాళ్లు?

- జిల్లాలో 1278 పంచాయతీ కార్మికులు
- కనీస వేతనం మరిచి రూ.వెయ్యితో సరిపెట్టిన సర్కార్‌
- వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- హామీలను నెరవేర్చాలని డిమాండ్‌



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

చందుర్తి(వేములవాడ): గ్రామాల్లో నిత్యం ప్రజల అవసరాలు తీర్చే సఫాయిలు, కారోబార్లు, ఎలక్ట్రీషియన్స్‌లను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చాలీచాలని వేతనాలతో సిబ్బంది కాలం వెళ్లదీస్తున్నారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా వేతనాలు తక్కువ ఉండటంతో ప్రభుత్వం రూ.8, 500 పెంచింది. పెరిగిన నిత్యావసరాలతో పూట గడవడమే కష్టంగా మారిందని, కొన్ని నెలలుగా కనీస వేతనాన్ని అమలుచేయాలని మంత్రులు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని కలెక్టరేట్‌ ఎదుట సమ్మెకు దిగుతామని జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందించారు. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం మే డే రోజున రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. వేతనాలు కూడా నెలనెలా ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని కార్మికులు వాపోతున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలుండగా 1278 మంది పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతుందా అన్న ధీమాతో పనిచేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదని ఆవేదన చెందుతున్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్‌

తమ సమస్యలు, డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు వాపోతున్నారు. సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని పంచాయతీల సిబ్బంది డిమాండ్‌ చేస్తున్నారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం 44 రోజుల పాటు చేపట్టిన సమ్మెకాలంలో కార్మికులకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్‌ నేరవేర్చాలని డిమాండ్‌ చేస్తున్నారు.

రూ. వెయ్యి పెంచడంపై అసంతృప్తి

మూడేళ్ల క్రితం 51 జీవోతో కార్మికులతో పనులు చేయిస్తోంది. మల్టీపర్పస్‌ కార్మికుల్లో సఫాయి, ఎలక్ట్రీషియన్‌, వాటర్‌మెన్‌, ట్రాక్టర్‌ డ్రైవర్లు ఉన్నారు. 500 మంది జనాభాకు ఒక్కో కార్మికుడికి రూ.8,500 చొప్పున వేతనం చెల్లిస్తోంది. నైపుణ్యం లేకున్నా అన్ని పనులు చేయిస్తున్నారు. కాగా ప్రభుత్వం వారి డిమాండ్లను తుంగలో తొక్కి మే డే సందర్భంగా కార్మికులకు రూ.వెయ్యి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. పెంచిన వేతనం కూడా గ్రామ పంచాయతీలో నుంచే తీసుకోవాలని స్పష్టతనిచ్చింది. ఆర్థికసంఘం, ఎస్‌ఎఫ్‌సీ నిధులు రాక మూడు నెలలకోసారి సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్న క్రమంలో మరో రూ. వెయ్యి పెంచడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ నిధుల నుంచి కాకుండా నేరుగా తమ బ్యాంకు ఖాతాలో జమచేయాలని డిమాండ్‌ చేస్తున్నారు.

పంచాయతీ కార్మికుల డిమాండ్లు

- గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్‌ కలెక్టర్లను అసిస్టెంట్‌ పంచాయతీ కార్యదర్శిగా ప్రత్యేక హోదా కల్పించాలి.
- కనీస వేతన చట్టం కింద రూ.21,500 వేతనం చెల్లించాలి.
- జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి 51 జీవో సవరించి కేటగిరీల వారిగా హోదా కల్పించాలి. కనీసం వేతనం రూ.15,500 చెల్లించాలి.
- ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలి.
- పంచాయతీ నిధుల నుంచి కాకుండా నేరుగా వేతనాలను సిబ్బంది ఖాతాల్లో జమచేయాలి.
- పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలి.
- గ్రామ పంచాయతీ కార్మికులకు సమ్మెలో ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి.
- కార్మికుల సవరణను నిలిపివేయాలి.

ఇరవై ఏళ్లుగా పనిచేస్తున్నా



సనుగుల గ్రామ పంచాయతీలో 2002 నుంచి కారోబార్‌గా పనిచేస్తున్నా. మొదట రూ.350తో పనిచేశా. ఉదయం నుంచి రాత్రివరకు గ్రామస్తులకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నా. కనీస వేతన చట్టాన్ని అమలుచేయాలి. అర్హత కలిగిన వారిని అసిస్టెంట్‌ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలి. – గంధం ప్రదీప్‌, సనుగుల, కారోబార్‌

ప్రభుత్వం దయచూపాలి



సఫాయి కార్మికురాలిగా 25 ఏళ్లుగా పనిచేస్తున్నా. వేతనం కూడా మూడు నాలుగునెలలకోసారి ఇస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక తమ బతుకులు మారుతాయని ఆశించాం. చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న తమపై ప్రభుత్వం దయ చూపాలి. – బింగి లక్ష్మి, సఫాయి, జోగాపూర్‌.

హామీలు అమలుచేయాలి



సీఎం కేసీఆర్‌ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి. ఏళ్ల తరబడి వెట్టిచాకిరి చేస్తూ దుర్భర జీవితం గడుపుతున్నాం. కనీసం వేతనం పెంచాలని డిమాండ్‌ చేస్తే ప్రభుత్వం రూ.వెయ్యి మాత్రమే పెంచింది. వేతనాలను నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేయాలి. – మల్యాల నర్సయ్య, పంచాయతీ కార్మిక సంఘం జిల్లా నాయకుడు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 23 ఏళ్ల తర్వాత వారు ఒకే వేదికపై కలుసుకని అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. హెచ్‌ఎం ఆగంరెడ్డి, ఉపాధ్యాయులు లింగారెడ్డి, మల్లయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు భాను, అశోక్‌, సాయికృష్ణ, రంజిత్‌, ఉపేందర్‌, శేఖర్‌, భాస్కర్‌, రాజు, పూర్ణిమ, సుజాత, రజిత తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



రాజు (ఫైల్‌)

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లికి చెందిన కొండవేని రాజు (29) అనే యువ రైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్‌ కానిస్టేబుల్‌ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లికి చెందిన కొండవేని పర్శరాములుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. రెండో కుమారుడు రాజు తన భూమితో పాటు, సోదరుడి భూమి కలిపి మరో వ్యక్తికి చెందిన మూడెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మొత్తం ఆరెకరాల్లో పంట వేయగా పెట్టుబడి కోసం అప్పులు చేశాడు. ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదన చెందాడు. ఆదివారం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌ కానిస్టేబుల్‌ తెలిపాడు. రాజుకు భార్య మౌనిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువుల కాపరి మృతి

- కారు డ్రైవర్‌ కోసం గాలిస్తున్న పోలీసులు



కరీం మృతదేహం

సిరిసిల్లటౌన్‌: పశువులను తోలుకుపోవడానికి వెళ్తున్న కాపరిని కారు ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. వేములవాడ మండలం తెట్టెకుంటకు చెందిన పశువుల కాపరి కరీం సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లోని ఓ పాడి రైతువద్ద పనిచేస్తున్నాడు. రోజులాగే పశువులను మేపడానికి సిరిసిల్ల శివారులోని రైస్‌మిల్లు వెనకాలకు తీసుకొచ్చాడు. ఆదివారం సాయంత్రం పశువులను యజమాని ఇంటికి తీసుకెళ్లడానికి సైకిల్‌పై సిరిసిల్లకు వస్తుండగా వెనకాల నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు, డ్రైవర్‌ ఆచూకీ లభించలేదు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు



గాయపడిన గంగమ్మ

బోయినపల్లి (చొప్పదండి): పిచ్చికుక్క దాడిలో ముగ్గురు గాయపడ్డారు. మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన కట్ట గంగమ్మ, జాగిరు రాజమ్మ, షాదుల్ల పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు. కొన్ని రోజులుగా గ్రామంలో పిచ్చికుక్కల బెడద ఉందని, దీంతో భయాందోళన చెందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



చీకట్లో వారసంత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంత చీకట్లోనే కొనసాగిస్తున్నారు. వారసంతలో పగటిపూటే ఎన్నో సార్లు ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయి. మరి చీకట్లో జరిగే సంఘటనలకు బాధ్యులు ఎవరని చిరు వ్యాపారులు, సంతకు వచ్చే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార సంతలో వసతులు కల్పించాలని కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



సిరిసిల్ల: వీరంతా ఉద్యోగాలు.. వ్యాపారాలు చేస్తూ నిత్యం బిజీగా ఉంటారు. అంతా 50 ఏళ్ల వయస్సు పైబడిన వారే. కానీ ఆదివారం ఆటవిడుపుగా సిరిసిల్ల మినీస్టేడియంలో ఇలా వాలీబాల్‌ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. నిత్యం వాకింగ్‌ చేస్తూ.. వాలీబాల్‌ ఆడుతూ.. నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్రతీ ఆదివారం ఇలా ఉదయం పూట వాలీబాల్‌ షో మ్యాచ్‌ ఆడుతూ సరదాగా గడుపుతుంటారు. కొందరు వాకింగ్‌ చేస్తుంటే.. మరికొందరు ఆటను చూస్తూ.. ఆస్వాదిస్తుంటారని సిరిసిల్ల వాలీబాల్‌ వాకర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, ప్రధాన కార్యదర్శి దర్శనం రామస్వామి తెలిపారు.